# తుఫాను

పెద్దిభొట్ల సుబ్బరామయ్య



అర్ధరాత్రి ... మసక వెన్నెల ... 'రివ్వున' చల్లగాలి... నేను భుజంమీది తుండును మెడ చుట్టూ చుట్టుకుని కూర్చున్నాను. పక్కన ఎక్కడో పసిపిల్ల ఏడుపు...అటు తిరిగి చూశాను. ఆ తల్లి నిద్ర మత్తులోనే పిల్లను సముదాయిస్తున్నది.

ప్లాట్‌ఫారం నిండా జనం... నిన్నటి రోజు ఉదయంనుంచీ రైళ్ళులేక, వేరే దారిలేక, చిక్కుబడిపోయిన జనం ఆ కటిక నేలమీద చలిలో అడ్డదిడ్డంగా పడుకుని నిద్రపోతున్నారు.

నేను కళ్ళార్పకుండా ఆ మసక వెన్నెలతో మిలమిల లాడుతున్న రైలుపట్టాల వంకనే చూస్తూ కూర్చున్నాను. ఇప్పుడో మరి కొద్ది సేపట్లోనో, లేక రేపో మా అందరి అదృష్టం పండితే రైలు వస్తుంది. ఎలాగో కష్టపడి అందులో నిలబడేందుకయినా చోటు సంపాదించుకుంటే, ఆ రైలు దాని అనుగ్రహం ఉన్నంతవరకు తీసుకుపోయి వొదిలి పెడు

తుంది.

నా పక్కనే ఎవరిదో నీడ కదిలింది. నేనటు చూశాను. ఒక వ్యక్తి సన్నగా దగ్గి, 'అగ్గిపెట్టె ఉందా?' అని అడిగాడు చేతిలో బీడీ ఉంచుకుని. నేను జేబులో నుంచి అగ్గిపెట్టె తీసి యిచ్చాను. అతడు కొంచెం పక్కకు తిరిగి బీడీ వెలిగించుకుని, అగ్గిపెట్టె తిరిగి యిచ్చేసి, స్తంభాని కానుకుని రెండు దమ్ములు పీల్చాడు నేను అతని వంకనే చూస్తూ కూర్చున్నాను.

అతడు అంతలో తువ్వాలుతో మూతి కప్పుకుంటూ 'సగం మీసం గొరిగేశారు' అన్నాడు.

తర్వాత అతి సహజమైన కంఠస్వరంతో నెమ్మదిగా 'నేనిక్కడ టీచరుగా ఉంటున్నాను. పదిహేనేళ్లు దాటింది. అయిదారు రోజుల్ క్రిందట మేముంటున్న యింటిగోడమీద 'గో బ్యాక్' అని రాశారు. ఇంటికి ఉత్తరాలు, హెచ్చరికలు పంపించారు. ఒకనాడు రాత్రివేళ యింటిమీదికి వచ్చి పడ్డారు. రాత్రి పన్నెండు గంటలవేళ...మా ఆవిడా నేనూ పసిపిల్లను దగ్గర పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కూర్చుని వున్నాం...అప్పుడు [illegible]ంగా మూక వచ్చిపడింది. తలుపు తియ్యకపోతే బద్దలు కొడతారేమో అనిపించింది. మా ఆవిడను మరుగుదొడ్లో దక్కోమని చెప్పి, నేను వెళ్లి తలుపు తీశాను. అంతా లోపలికి తోసుకు వచ్చారు... తాగి తూలుతున్నారు. బండ బూతులు పేలుతున్నారు. ఇంట్లో సామానంతా చిందరవందర చేశారు. చేతికి దొరికింది తీసుకున్నారు తర్వాత నన్ను నలుగురూ పట్టుకుని 'క్షవర కళ్యాణం జర్గాం...' అన్నారు. ఈ పని చేశారు. అంతసేపూ ఇంటికప్పు ఎగిరిపోయేట్టు నినాదాలు చేసి నన్ను కూడా 'జై!' అనమన్నారు. నేను గొంతు పగిలిపోయేలా అరిచాను. తర్వాత వెళ్లిపోయారు అప్పటికి తెల్లన్నాయి. ఆ ఉదయమే మా వాళ్లను పంపించేసి నేను సెలవుకోసం ఆగిపోయాను ... అదీగాక, పరిస్థితులు చక్కబడతాయని నమ్మకం కూడా ఉంది. [illegible] నిన్న రాత్రితో ఋణం తీరిపోయింది ... నన్ను కూడా తరిమేశారు' అన్నాడు.

అతడు మాట్లాడుతున్నంతసేపూ అతని వంకనే చూశాను. నీడలో కూర్చున్నందువల్ల అతని ముఖం నాకు స్పష్టంగా కనిపించలేదు. అతడు నిట్టూర్చడం వినబడింది నేను మళ్లీ రైలు పట్టాల వంక చూస్తూ ఉండిపోయాను ఎదురుగా ఆకాశంలో రెండు చుక్కలు తళ తళ మెరుస్తున్నాయి. తెల్లని రెక్కలు తటతట కొట్టుకుంటూ, విచిత్రంగా అరుస్తూ ఏదో పక్షి ఎగిరిపోతున్నది.

స్టేషనుమాష్టరు చేతిలో లాంతరు పట్టుకుని ప్లాట్‌ఫారంమీద అడ్డదిడ్డంగా పడుకుని ఉన్న మనుషులను తప్పించుకుంటూ విసుక్కుంటూ నడిచి వస్తున్నాడు. నేను లేచి వెళ్లి ఆయనపక్కనే నడుస్తూ 'సార్! బండి ఎప్పుడొస్తుంది సార్?' అని అడిగాను.

స్టేషనుమాస్టరు ఆగాడు. ఒక్క క్షణం నావంక చూసి తర్వాత కుడిచేత్తో ఆకాశంవంక చూపించి 'భగవంతుడికి తెలుసు ..' అన్నాడు తర్వాత గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

నేను మళ్లీ మామూలు చోటనే కూలబడ్డాను. నా పక్కనే ఉన్న వ్యక్తి నవ్వి 'అవును మరి...ఆయనకు మాత్రం ఏం తెలుస్తుంది? టెలిగ్రాఫ్ తీగలన్నీ తెగిపోయి, మూడురోజులయింది...' అన్నాడు.

నేను చలికి వణుకుతూ కూర్చుండిపోయాను. ఆ వ్యక్తి బీడీ చివరిదమ్ములు పీలుస్తున్నాడు కాబోలు చిటచిట మని సన్నని సవ్వడి వినబడుతున్నది. అతడంతలో బీడీముక్కను దూరంగా విసిరి పారేసి కుడిచేత్తో గడ్డం నిమురుకుంటూ ఉండిపోయాడు. తర్వాత నన్ను భుజం మీద తట్టి పిలిచి పక్కనే పసిపిల్లను పెట్టుకుని పడుకుని ఉన్న ఆడమనిషిని చూపిస్తూ 'సాయంకాలం వాళ్లతో మాట్లాడాను ..ఆమె మెడమీద నెత్తురు చార చూసి 'ఏమిటి'ని అడిగితే చెప్పింది. ఇంటిమీదికి మనుషులు వొచ్చిపడి వొంటిమీది నగలన్నీ ఇమ్మంటే తానే అన్నీ వొలిచి యిచ్చిందట .చివరకొకడు 'ఆ తాళిబొట్టు' అన్నాడు. ఆమె ప్రాధేయపడితే వినక బలవంతంగా మెడలో తాళి బొట్టును పట్టుకుని లాగాడు. దాంతో మెడ మీద రక్తం చిమ్మింది...ఆమె కూతురు పదహారేళ్ల పిల్లకు...జ్వరం... అందులో ఒకటే ఏడుపు...' అన్నాడు. నాకు అంతలో సీత గుర్తుకు వచ్చింది.

...మే మిద్దరం ఉలిక్కిపడ్డాము. చెవులు రిక్కించి విన్నాము. మరుక్షణంలో యిద్దరం లేచి పరుగెత్తుకువెళ్లి కటకటాల కానుకుని నిలబడి చూశాము. స్టేషనుకు కొద్ది దూరంలోనే పెద్ద గుంపు కనబడింది. ఎంతమంది మనుష్యులుంటారో ఊహించడం కష్టం... అందరూ ఏదేదో అరుస్తూ రణగొణధ్వని చేస్తున్నారు స్టేషనుకు దగ్గరలోనే ఉన్న ఒక డాబా యింటిముందు నిలబడి నినాదాలు చేస్తున్నారు.

నేను నేలమీద పడుకుని ఉన్న వాళ్లను జాగ్రత్తగా తప్పించుకుంటూ బయటికి వెళ్లి ఒక్కక్షణం ఆగాను. తర్వాత వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లి ఆగుంపు వెనక నిలబడ్డాను. అక్కడ అందరూ 'రేయ్! వాసుదేవరావ్! దిగిరారా...' అని అరుస్తున్నారు. 'మా ప్రెసిడెంటు బతికింది చాలిక దిగిరారా...' అని అరిచాడు నా పక్కన ఉన్న ఒక వ్యక్తి...

అంతలో ఒకడు ప్రహరీగోడ ఎక్కి కూర్చుని పెద్దగా 'వాడి ట్రాక్టరుందిరా యాడ...' అన్నాడు. దాంతో మరొక పదిమంది బిలబిలమంటూ గోడఎక్కి అవతలవైపు దిగారు. ట్రాక్టరునిండా పెట్రోలు పోశారు. మరుక్షణంలో బుసబుసమని మంటలు లేచాయి. జనం ఆ ఊవల ప్రహరీతలుపు పట్టుకుని నిలబడి 'జై! జై!' నినాదాలు చేస్తున్నారు! ట్రాక్టరు కాలిపోతున్న ఆ వెలుగులో నినాదాలు చేస్తున్న వారి ముఖాలు చిత్రంగా కనిపించాయి. ఆ దహనకాండ దాదాపు పది నిముషాలలో పూర్తయింది. ఇక ఆ జనానికేమీ కనిపించలేదు. ఆ యింటిని వొదిలి అందరూ మరోవైపుకు వెళ్లిపోయారు ట్రాక్టరు యింకా కాలుతూనే వుంది. నేను ప్రహరీ గోడమీదుగా చూస్తున్నాను అంతలో నా పక్కన ఒక వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. తగలబడిపోతున్న ట్రాక్టరు వంక చూస్తూ నిట్టూర్చాడు. నేను బెదిరిపడి చూశాను.

ఆ వెలుగులో ఆ వ్యక్తి కళ్లలో నీళ్లు మిలమిల లాడాయి.

ఆ తర్వాత ఆ వ్యక్తి కూడా నాపక్కనే నడిచి వచ్చాడు. మధ్యలో నిట్టూర్చి 'పాతిక ఏళ్లయింది ఇక్కడికి వొచ్చి ... ఇన్నాళ్లూ 'దొర దొర' అని నెత్తిమీద పెట్టుకున్నారు. వీళ్లకు ఎంతో చేశాను. తీరా ఈ నాడు పరాయివాణ్ణయి పోయాను ...మూడు రోజులనుంచీ ఈ తీరున దాడి చేస్తున్నారు. మా వాళ్లను అయిదు రోజుల క్రిందట పంపించేశాను. వాళ్లు నెల్లూరు చేరారో లేదో తెలీదు. అప్పటి నుంచీ అప్పుడొక రైలూ అప్పుడొక రైలూ తప్ప సక్రమంగా రైళ్లు లేనే లేవు...బస్సులూ లేవు...' అన్నాడు.

'మీరూ ఎలాగో ఒకలాగా వెళ్లలేక పోయారా?' అని అడిగాను నేను 'వెళ్లే వాణ్ణే...' కాని మనసు వెనకాడింది. ఈ ఊరిని నా స్వంత ఊరనుకున్నాను. ఈ జనం అంటే నాకు ఎంతో యిష్టం ...వారివి కల్లాకపటం లేని మనసులు. వారిని నా మనుషులనుకున్నాను అందు వల్లనే ఈ మూడురోజులూ నరసింహన్ అనే ఆరవమిత్రుడి యింట్లో అజ్ఞాత వాసం చేస్తూ ఉండి పోయాను. ఇక ఇక్కడ ఏమీ మిగలలేదు. వెళ్లి ఏరైలు వస్తే దాన్ని ఎక్కి...' అంటున్నాడా వ్యక్తి. అంతలోనే ఆయన కంఠం పూడుకు పోయింది.

# తుఫాను


నేను హఠాత్తుగా ఆగి 'మీ కిక్కడ పొలాలున్నాయా ?' అని అడిగాను.

'ఉన్నాయి ... చాలా కాలంనుంచీ వ్యవసాయం చేస్తున్నాను ఎందుకూ కొరగాని భూములలో ఈ చేతులతో ఎంతెంత పంట పండించానో లెక్క లేదు. పంపులు పెట్టించి, ట్రాక్టర్లతో దున్నించి కూరగాయల దగ్గర్నుంచి ఎన్నో పండించాను. ఎన్నో కుటుంబాలు రెండుపూటలా కూర నారలతో తిండి తింటూ హాయిగా ఉన్నాయి. ఆ జనంకూడా...' అంటూ ఆగాడాయన. ఆయన గొంతులో ఏదో అడ్డం పడినట్టయింది. అంతలోనే సర్దుకుని 'ఆ జనం కూడా ఎంతో మంచి వాళ్లు, స్నేహానికి ప్రాణంయిస్తారు రాష్ట్రానికేదో శనిపట్టింది. కాని కాలం వచ్చి యిట్లా...' అన్నాడు.

అంతలో యిద్దరం ప్లాట్‌ఫారంమీదికి వచ్చాము అంతకుముందు అక్కడ ఉన్న టీచరు నావంక చూసి 'అగ్గిపెట్టె మళ్లీ యివ్వండొకసారి...' అని అడిగి తీసుకున్నాడు. వాసుదేవరావు అక్కడే కూర్చుని నెమ్మదిగా 'నిన్నటినుంచీ ఆ నరసింహన్ నన్ను కడుపులో పెట్టుకుని కాపాడాడు. ఏదీ, నాకూ ఒక బీడీ యివ్వండి. నిన్నటి నుంచీ సిగిరెట్టు లేకుండా ఉండి పోయానూ' అంటూ బీడీ అడిగి తీసుకుని ముట్టించుకున్నాడు. టీచరు. 'అవును వీళ్లకు మనం తప్ప మిగిలిన అందరూ మిత్రులే కదా ?' అన్నాడు.

నేను అక్కడే కూలబడి దూరంగా రెండో రైల్వే లైను చివరఉన్న కదలని రైలువంక, చెడిన ఇంజనువంక చూస్తున్నాను. ఆ యిద్దరూ నెమ్మదిగా ఏదో మాట్లాడు కుంటూ కూర్చున్నారు. అంతలో మళ్లీ స్టేషనుమాస్టరు అటు వైపు వచ్చాడు ఒకచేతిలో లాంతరు పట్టుకుని రెండో చేత్తో క్రాపు సర్దుకుంటూ నడిచిపోయాడు.

ఇది రెండోరోజు...ఇలా ప్లాట్‌ఫారం మీద నివాసం మొదలై దాదాపు ముప్ఫయి గంటలు దాటింది. ఈ జనం, పిల్లాపాపా, ఆడా మగా అందరూ ఆనాడు రైల్లో క్రిక్కిరిసి ఉన్నారు దాదాపు అందరూ కట్టుబట్టలతో ఇళ్లు, ఊళ్లు, ఉద్యోగాలు వొదిలిపెట్టి ప్రవాసం వస్తున్నవారే ... అందరి ముఖాలలో దైన్యం, దిగులు, గూడు కట్టుకుని ఉన్నాయి. ఆరైలు చాలా నెమ్మదిగా నడుస్తూ వచ్చింది. యాభై మైళ్ల దూరం గడిచేందుకు దాదాపు ఆరు గంటలు పట్టింది. రాత్రి ఎనిమిది గంటల వేళకు ఇక్కడికి చేరుకున్నది. చుట్టూ తలుపులూ కిటికీలూ మూసుకుని లోపల బిక్కు బిక్కు మంటూ కూర్చుని ఉన్నారు జనం...'ఇక్కడ రైలు ఎందుకింతసేపు ఆగిందా' అని అనుమానం వచ్చి నేను కిటికీ రెక్క ఎత్తి తల బైటికి పెట్టి చూశాను. ఇంజనుముందు ఏదో గొడవ జరుగుతున్నది. జనం విపరీత సంఖ్యలో గుమికూడి రైలును ఆపు చేశారు కొద్దిసేపు తర్వాత గార్డు వచ్చాడటు...నేను 'ఏమిటండీ అది' అని అడగ్గా 'ఏముంది బాబూ! రైలు యింక ముందుకు వెళ్లేందుకు వీల్లేదట.' అంటూ వెళ్లిపోయాడు. నేను కొయ్యబారిపోయాను. వీళ్లు మనలను అక్కడ ఉండనివ్వక, ఊళ్లు వొదిలి వాళ్ల ప్రాంతం వొదిలి వెళ్లమని తరుముతున్నారు. పోదామంటె వీల్లేకుండా బస్సులనూ, రైళ్లనూ ఆపు చేస్తున్నారు. ఎలా చావడం? నేను అలా చూస్తూ ఉండగానే కొద్ది క్షణాల్లో రైలు



పెట్టెలమీద దాడి ప్రారంభమైంది. జనం బలవంతంగా ప్రయాణీకులందర్నీ దింపి వేశారు. కిటికీల అద్దాలు పగల గొట్టారు. ప్రయాణీకులను అడమగ వివక్షత లేకుండా తోశారు. కొందరిని తన్నారు. బూతులు తిట్టారు. దాదాపు అందరి దగ్గరా ఉన్న కొద్దో గొప్పో డబ్బు వసూలు చేశారు. అందర్నీ ప్లాట్ ఫారంమీద దింపివేసి డ్రైవరును బెదిరించి రైలును ఉపయోగంలేని రెండోలైను మీదికి రప్పించి అప్పుడు ఇంజనులో చేతికి దొరికిన బోల్టులూ, నట్టులూ విప్పి నిప్పు చల్లార్చి, బొగ్గు అంతా పారబోసి నినాదాలు చేసుకుంటూ వెళ్ళి పోయారు.

...వాసుదేవరావు నేలమీద వెల్లకిలా పడుకుని చేతులు తలక్రింద పెట్టుకుని 'ఇది నా స్వంత ఊరనుకున్నాను...' అంటున్నాడు మళ్ళీ.

'అవును మీలాగే చాలా ఏళ్ళక్రిందట యిక్కడికి వచ్చి స్థిరపడి 'మా వూరు మా భూమి' అనుకున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఉన్న ఊళ్ళు వదలి పెట్టి తమ పెట్టుబడులన్నీ యిక్కడ పెట్టి భూములు కొని పంటలు పండించి...' అంటున్నాను నేను.


ఆ టీచరు నా మాటకు అడ్డం వచ్చి 'వాళ్ళూ అదే అంటున్నారు. ఇక్కడ భూములు చవగ్గా కొని పంటలు పండించి వాళ్ళను కూలీలుగా మార్చి, వాళ్ళను మనతో సమానంగా కాకుండా తక్కువగా హీనంగా చూశాం... వాళ్ళ ఉద్యోగాలకూ ప్రమోషన్లకూ అడ్డం వచ్చాము.

ఇవిగో ఈ కరపత్రాలు చూడండి, వీటిలో అంతా రాశారు...'

వాసుదేవరావు, నేనూ ఆవ్యక్తి వంక చూశాము. అతడు కరపత్రాల బొత్తి చూపిస్తూ 'అవును. వీటికేం సమాధానం చెప్పగలం? ఎవరు మాత్రం సమాధానం చెప్పగలరు?' అన్నాడు. తర్వాత ఒక్కక్షణం ఆగి,

'ఇంకా నయం...మనల్నిలా ప్రాణాలతో వెళ్ళనిస్తున్నారు. అక్కడికి మనం అదృష్టవంతులం...ఆ సర్వేయరు లాగా కాకుండా...' అంటూ మొహంమీద తువ్వాలు తీసి 'మా వూళ్ళో దిగి దిగగానే మన వాళ్ళకు ఈ సగం మీసం చూపిస్తాను'


తల్లినుండి పిల్లకు పారంపర్యా వుడ్‌వార్డ్స్ వార్త వాడుకగా వస్తోంది
మీ శిశువును
వుడ్‌వార్డ్స్
గ్రైప్ వాటర్‌తో
ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి
తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్‌వార్డ్స్' కడుపులో కుట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్ల వచ్చునప్పటి జబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.







సురక్షితంగా వుండండి. నిబ్బరంగా వుండండి. సర్వదా ఒక సీసాను దగ్గిరుంచుకోండి.

వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్ తెలివైన తల్లులు వంద ఏళ్లకు మించి వాడుతున్నారు.

AT. 30 Tl

పండిత్ డి. గోపాలాచార్యులవారి
అరుణా
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండీ ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100 జీన్ రోడ్ మదరాసు-17.

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్

"బ్రా బ్రా"
హోవిరా తో
3 బ్యాండ్, ఆల్ వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను నెలకు రు. 5/- వంతున చెల్లించే పద్ధతిని పొందండి. ప్రతి గ్రామమునకు, నగరమునకు పంపగలము. నేడే వ్రాయండి.
HIND AGENCIES (67)
Kolhapur Road, Delhi-7.

కావలెను

నెలకు రు. 650 జీతము లేక చక్కని కమిషన్ పద్ధతిమీద జపాన్ ఆర్టు చీరెలు, టెరిలిన్ సూటింగులు, రెడీమేడ్ ఉడుపులు, నైలాన్ సాక్సు, టైస్ వగైరాలకు ఆర్డరు పొందుటకు సేల్సుమెన్ కావలెను. శాంపిల్సుకు వెంటనే వ్రాయ గోరడమైనది.
ARVIND AGENCIES (5)
Post Box 1408 Delhi-6.

ఉచితం! ఉచితం!! ఉచితం!!!
తెల్లమచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనా సరే వాని రంగు మరియు యెర్రమచ్చలరంగు, మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడుదినములలో మారును. ఆటు పైన మామూలు చర్మంవలె మండిపోవును. ప్రచారం కొరకు 1 సీసామందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
ROUND BHAWAN (DS)
P. O. KATRISARAI (GAYA)

అన్నాడు.

నేను మెల్లిగా 'మాపనిస్తే వాళ్ళేం చేయగలరు?' అన్నాను.

'జాలి చూపిస్తారు. అది చాలు నాకు. ఇన్నాళ్ళూ మామూలు బడిపంతులుగా బ్రతికినవాణ్ణి కానీకూడా వెనక వేసుకోలేదు రేపు అక్కడికి వెళ్ళిన తర్వాత ఏదో ఒక ఉద్యోగం దొరికేదాకా అడుక్కుని అయినా తిని బతకాలి కదా! అప్పుడిది పనికొస్తుంది నా వేషం చూసి పాపం అనుకుని అయినా ఎవరో ఒకరు కాసిని పైసలు పారెయ్యక పోరు' అంటుండగా ఆయన గొంతు గద్గదికమైంది

వాసుదేవరావు 'ఇందులో జనం తప్పు ఏమీ లేదు. ఈ నాయకులు...'అంటూ ఆగిపోయాడు.

ఆ తర్వాత ముగ్గురికీ ఏం మాట్లాడాలో తోచలేదు నిశ్శబ్దంగా ఉండిపోయాము.

వెన్నెల వెలా తెలా పోతున్నది చుట్టుపక్కల అంతా కలతనిద్ర పోతున్నారు మా పక్కనే ఎవరో పసిపిల్ల కల గన్నదో ఏమో కెవ్వున అరిచి పెద్దగా ఏడవటం ప్రారంభించింది. వెంటనే పక్కనే ఉన్న తల్లి లేచి 'మా అమ్మ ఊరుకోవే తల్లి ఊరుకోవే...' అంటూ సముదాయించడం ప్రారంభించింది.

నాకు సీత గుర్తుకు వచ్చింది. చేతులు మోకాళ్ళ చుట్టూ చుట్టుకుని కూర్చుని అంతా జ్ఞాపకం చేసుకున్నాను

సీత!... ఆమెది ఎల్లప్పుడూ చిరునవ్వుతో కలకలలాడుతూ ఉండే ముఖం. నీటి కెదురెక్కుతున్న పెద్దపెద్ద చేపల వంటి కన్నులు...పదునైన తెలివి తేటలను సూచించే సన్నని ముక్కు...నవ్వితే సొట్టలు పడే బుగ్గలు ... పచ్చని ముంజేతిమీద గుండ్రని పచ్చబొట్టు ... మొట్టమొదటి సారిగా నేను ఆ ఊరికి వెళ్ళి నేరుగా నా ట్రంకు పెట్టెతోనే బడికివెళ్ళి హెడ్మాస్టరుకు కనిపించాను. ఉద్యోగంలో చేరి ఆ సాయంకాలమే ఇంటికోసం వెదుక్కుంటూ ఊరిమీదికి బయలు దేరాను. సాయంకాలం అయిదుగంటలవేళ...అక్కడ ఏదోభాగం ఖాళీగా ఉందని తెలిసి వెళ్ళాను. అప్పుడు యింట్లో ఆ పిల్లతప్ప పెద్దవాళ్ళెవరూ లేరు. నేను బయట నిలబడి 'ఎవరండీ లోపల? ఇక్కడ అద్దెకిచ్చే వాటా ఏదయినా ఉందా?' అని అడిగాను. ఆ పిల్ల తలుపుచాటున నాకు కనిపించకుండా నిలబడివుండి పెద్ద ఆరిందాలాగా మాట్లాడింది. మొదట్లో ఆమెను ఏ మధ్య వయస్కురాలో అనుకుని నేను ఆమె అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పాను. కాని ఒక్క నిముషం తర్వాత బయటినుంచి ఆమెతల్లి వచ్చింది. మళ్ళీ ఆమె ప్రశ్నలు మొదలు. ఆతర్వాత తెలిసింది. నేనంతవరకూ మాట్లాడింది కేవలం పదిహేడేళ్ళ పిల్లతో అని... శాంతమ్మగారు చాలా మంచిమనిషి .. ఎంతో ఆదరంగా మాట్లాడింది. తర్వాత నాకు తెలిసింది. వాళ్ళదికూడా ఒకప్పుడు గుంటూరుజిల్లా, దాదాపు యిరవైఏళ్ళ క్రితమే ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారట ఇల్లు కట్టుకుని ఉద్యోగం చేసుకుంటూ గుంభనగా ఉంటూ ఉండగా అకస్మాత్తుగా యింటి యజమాని ఏదో ప్రమాదంలో చనిపోయాడు, అప్పటినుంచీ ఆమె తన ఒక్కగా నొక్క కూతుర్ని కడుపులో దాచుకుని కాలక్షేపం చేస్తున్నది


...నా పక్కన ఉన్న యిద్దరూ ఇంకా రాజకీయాలు మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఆ టీచరు చాలా ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు. ఉండి ఉండి గొంతు సర్దుకుంటున్నాడు 'మనం అంతా ఒకే భాష మాట్లాడే వాళ్ళం ... ఒకే జాతికి చెందినవాళ్ళం...మనసాహిత్యం, సంస్కృతి ఒక్కటే...ఇలా అని ఉపన్యాసాలు వింటూ వుంటాం..!.మరి ఈ ఉద్యమానికి అర్థం ఏమిటి? ఎందుకిలా మన రాష్ట్రంలోనే మనం పరాయివాళ్ళమై పోయాం? ఆ ప్రాంతానికి జరిగిన అన్యాయం ఏమిటి? జరిగితే దానికి కారకులెవరు? పెద్దమనుషుల ఒప్పందాలు ఏమైనాయి? వాళ్ళ మిగులు నిధులు ఏమయ్యాయి? వాటిని ఇక్కడ అసలు ఖర్చుపెట్టలేదని మన నాయకులు ఒప్పుకున్నారు కదా? మరి ఆ నిధులను ఎక్కడ ఖర్చుపెట్టారు? రాయలసీమలో ఖర్చు పెట్టారా? ఆ ప్రాంతాలను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. అక్కడ చిన్న మెట్టు

అయినా అభివృద్ధి లేదు. మరి, సర్కారు జిల్లాలో ఖర్చుపెట్టారా? వెళ్ళి తెనాలి, బెజవాడలు చూడండి ... గుంటూరు నెల్లూరు జిల్లాలు తిరిగి చూడండి... ఆ నగరాలనబడే వాటిని చూడండి...అక్కడ మిలమిలలాడే తారురోడ్లు లేవు. అక్కడి రోడ్లు యింకా గతుకులతోనిండి ఘోరంగనే ఉన్నాయి. మరి ఈ మిగులు నిధులనేవి ఏమైనాయి? ఏ ప్రాంతంలో ఖర్చు పెట్టారు? ఎవరు దీనికి బాధ్యులు?...' ఈ ధోరణిలో ఆయన ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు

నేను ఆకాశంలోకి చూశాను ఒక పలుచని మబ్బు చివర చంద్రబింబం సిల్కుతెర చివర వ్రేలాడుతున్న పెద్ద మంచి ముత్యం వలె ఉంది స్టేషనుకు ఒకవైపు దూరంగా కనుచూపుమేర ఎక్కడా ఒకే ఒక చెట్టు తప్ప మరేమీ కనుపించడంలేదు ఆ చెట్టు గుండ్రంగా విప్పి వుంచిన గొడుగువలె పెరిగి వుంది.

నా మనసులో సీత చిరునవ్వు మెదిలింది. ఆ ఆలోచనతోనే గుండెల్లో వెచ్చగాలి వీచినట్టయింది. అక్కడ ఉన్న మూడు సంవత్సరాల్లోనూ, నేను వారికి చాలా సన్నిహితుణ్ణయిపోయాను. శాంతమ్మగారు నన్ను విడిగా వంట చేసుకోనీయలేదు. పగలల్లా స్కూల్లో ఆ పిల్లలకు చదువు చెబుతూవుంటే ఎంతో తృప్తిగా ఉండేది. నాకు కాలక్రమేణా ఆ మనుషులంటే గొప్ప యిష్టం ఏర్పడింది. వారి అమాయకత్వం, ఋజువర్తన, కల్లాకపటం లేని వారి ఆంతర్యాలూ నాకు ఎంతగానో నచ్చాయి. నేను వారిలాగే మాట్లాడటం నేర్చుకున్నాను వారిలో అన్నివిధాలా ఒకడిగా కలిసిపోయే ప్రయత్నం చేసి విజయం సాధించాను ఎప్పుడన్నా ఒకసారి స్వంత ఊరు వెడితే కూడా నేను ఇలాగే మాట్లాడేవాణ్ణి. మా అమ్మా, చెల్లాయీ 'ఏం చోద్యం' అనుకునేవారు 'అంతా బడాయి' అనేది మా రెండో చెల్లెలు...అయినా నాకు ఆ భాష అంటే ఎంతో యిష్టం...అలా మొన్నటి వరకూ వారితో కలిసే ఉండిపోయాను ఉన్నట్టుండి హఠాత్తుగా పరిస్థితి మారిపోయింది. సజావుగా నడుస్తున్న చరిత్ర ఒక్కసారిగా వింత మలుపు తిరిగింది. నాలుగురోజుల క్రితం ఒకనాడు స్కూల్లో సూటీ పోటీ మాటలు ప్రారంభమైనాయి. నేను వాటిని అంతగా పట్టించుకోలేదు. ఊళ్ళో ఊరేగింపులు ప్రదర్శనలు జరిగాయి. చెవులు చిల్లులు పడేలా నలువైపుల నుంచీ నినాదాలు మిన్ను ముట్టాయి. మొన్న సాయంకాలం స్కూలు నుంచి వచ్చి తాళం తీయబోతూ అకస్మాత్తుగా కొయ్యబారి నిలబడిపోయాను. తలుపు మీద సీమసున్నంతో అక్షరాలున్నాయి. తర్వాత తలుపుతీసి లోపల అడుగు పెట్టగానే ఒక ఉత్తరం...అందులోనూ అదే హెచ్చరిక. ఇరవైనాలుగు గంటలలోగా ఊరువదలి వెళ్ళిపోవాలి, లేకపోతే మర్యాద దక్కదు నాలో ఏదో తెలియని వింత దుఃఖం పొంగి వచ్చింది. అంతలో శాంతమ్మగారు వచ్చి నన్ను హడావిడిగా వాళ్ళ వాటాలోకి తీసుకుపోయింది. తర్వాత కలవరపడుతూ ఆనాడు సాయంకాలం పెద్దగుంపు వచ్చి ఇంటిముందు నిలబడి కేకలు వేసిన వైనమూ, వాడిని వెళ్ళగొట్టకపోతే ఊరుకునేది లేదని హెచ్చరికలు జారీచేసిన వైనమూ చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. నేను అర్థం చేసుకున్నాను నేను వెంటనే యిల్లు విడిచి వెళ్ళకపోతే వారికి కష్టం కలిగించినవాణ్ణవుతాను ..నేను అలా కొయ్యబొమ్మలా కూర్చుని వింటూ ఉండగా ఆమె .అంతా చెప్పి చివరకు 'నువ్వు యిప్పుడు ఎట్లాగా వెళ్ళాలి నాయనా! బస్సులు లేవుగాని రైళ్ళు వస్తూనే వున్నాయి. ఇక్కడినుంచి ఎలాగో ఒకలాగు ఈ ఎనిమిదిమైళ్ళూ నడిచి స్టేషను చేరుకో. ఏదో రైలు అందుకుని ప్రస్తుతానికి యింటికి వెళ్ళిపో ..కొద్దిరోజుల్లోనే ఈ గొడవలు తగ్గిపోతాయి. అన్నదమ్ముల పోట్లాట ఎంతకాలం సాగుతుంది గనుక? గొడవలు తగ్గాక వచ్చేద్దువుగాని' అప్పటివరకూ నీ సామానూ అదీ మేము భద్రంగా చూస్తుంటాము సరేనా?' అన్నది. నేను సరేనని తల వూపాను. కాని నా మనసులో ఏదో ఒకమూల సందేహం మొలకెత్తింది. వీళ్ళు కూడా నిజానికి యిక్కడి వారు కాదుగదా? మరి ఈదాడి వీరిమీదికి రాదని నమ్మకం ఏమిటి? ఆ మాటే శాంతమ్మగారిని అడిగి 'మీరూ వచ్చెయ్యండి.' అని సూచించాను.

'భలేవాడివయ్యా మేమిక్కడికి ఎక్కడినుంచో వచ్చిన సంగతి తెలిసిన వాళ్ళెవరూ ఇప్పుడులేరు నువ్వంటే రెండేళ్ళ క్రిందటే వచ్చావు గనుక వాళ్ళకు నీ వివరాలు తెలిశాయి. మాసంగతి అలా కాదుగా. మేము ఇక్కడివాళ్ళమే అదీగాక మాకు మరెక్కడా ఎవరూ లేరు ..స్వంత ఊరూ, స్వంతయిల్లూ వాకిలి ఎక్కడికో వెళ్ళమని మమ్మల్నెవరూ అడగరు. అదీగాక నువ్వు ఇక్కడి వాళ్ళెవరో చేయవలసిన ఉద్యోగంలో ఉన్నావు. మాకే



మున్నాయి? ఉద్యోగాలా భోగభాగ్యాలా? ఏమి చూసి వాళ్ళు మా మీద దాడి చేస్తారు" ఇలా మాట్లాడుతూనే శాంతమ్మగారు ఒక పళ్ళెంలో ఏవేవో తినుబండారాలు తెచ్చి యిచ్చి నాచేత తినిపించింది తర్వాత మరిన్నింటిని ఒక కాగితంలోకట్టి యిచ్చింది. సీత అలాగే ఉయ్యాలబల్ల నానుకుని నిలబడి ఉందే తప్ప వెళ్లొస్తా ఒక్కమాట అయినా అన లేదు. అంతలో నా శరీరం జలదరించింది. శాంతమ్మగారూ, సీత కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు .. వాకిట్లో ఎందరో మనుషులు గుమికూడినట్టు సందడి... శాంతమ్మగారు నా చెయ్యి పట్టుకుని లేవదీసి 'వెళ్ళు వెళ్ళు త్వరగా ... ఎక్కడా ఆగకు.. పరుగెత్తు..' అంటూ పెరటి తలుపు తీసింది. నేను సీత వంక ఒక్కసారి చూశాను. పందిలో నీడలో నిలబడి ఉండటంవల్ల ఆమె మొహం కనిపించనే లేదు. క్షణంలో శాంతమ్మగారి వైపు తిరిగి చేతులు జోడించి వెంటనే బయట పడి పరుగెత్తడం ప్రారంభించాను. వేగంగా, మరింత వేగంగా, ఊరికి దూరంగా పరుగెత్తాను. అంతశక్తి నాలో ఎలా వచ్చిందో నాకు తెలీదు ఎవరో తరుముకుని వస్తున్నట్టు ఎక్కడా ఆగకుండా పరుగెత్తి పరుగెత్తి చివరకు ఓకచోట నిర్మానుష్యమైన ప్రదేశంలో చెట్లచాటున ఆగి ఆయాసం తీర్చుకున్నాను ఒక చెట్టువేరుమీద తల పెట్టుకుని ఇసుకలో పడుకున్నాను అంతలో మగతగా నిద్రపట్టింది. నాకు మెలకువ వచ్చేసరికి అర్ధరాత్రి దాటి వుంటుంది. చంద్రుడు నడినెత్తిమీద ఉన్నాడు. మళ్లీ తువ్వాలు దులిపి పైన వేసుకుని ఆ మసక వెన్నెలలో నడవటం ప్రారంభించాను. రోడ్డుమీద ఎక్కడా మనుష్యులుకాని, ఏ వాహనాలుకాని, లారీలు కాని ఎదురు పడలేదు. ఒకేఒక మోటార్ సైకిలుమాత్రం కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో నా పక్కనుంచి దూసుకు పోయింది. నేను శక్తి అంతా కూడగట్టుకుని అరుస్తూ చేయి ఊపినా లాభం లేకపోయింది. అలా రాత్రి అంతా నడిచి పగలంతా నిర్మానుష్య ప్రదేశంలో దాక్కుని చివరకు పైన ఎక్కడో ఉన్న ఆ స్టేషనుకు చేరుకున్నాను. త్రోవలో ద్రాక్ష తోటలు ధ్వంసంకావడం చూశాను. ఇళ్ళు తగలబడటం చూశాను మూకలు చేరి కార్లనూ ఇతర వాహనాలనూ ఆపి బలవంతంగా డబ్బు వసూలు చేయడం చూశాను ముఖాలు వేలవేసుకుని దీనంగా, భయంగా కట్టుబట్టలతో నడిచిపోతున్న వారిని చూశాను. చివరకు అదృష్టం కొద్దీ రైలు అందుకుని పైనుంచి క్రిందికి వస్తూ ఇక్కడ చిక్కుబడి పోయాను నాలాగే ఈ మనుషులందరూ, ఆడా మగా పిల్లా పాపా అందరూ, తమ స్వంత రాష్ట్రంలోనే చోటుదొరకని శరణార్థులవలె కట్టుబట్టలతో, ఎటో ఒక వైపు పోతే చాలునని, రైలుకోసం పడిగాపులు కాస్తూ ...

...నేను ఉలిక్కిపడ్డాను చుట్టూ కలవరం...జనం హడావిడిగా లేచి నిలబడుతున్నారు. తమకు కావలసినవారిని 'రైలొస్తున్నది...... రైలొస్తున్నది...' అని తట్టి లేపుతున్నారు క్షణాల వ్యవధిలో ప్లాట్‌ఫారం అంతా గొప్ప హడావిడితో నిండిపోయింది. అంతటా గోల. కేకలు. .అరుపులు ..తోసుకోడాలు...

నేనూ లేచి నిలబడ్డాను దూరంగా ఇంజను దీపం కనుపించింది. రైలు పట్టాలు రెండూ ఆ కాంతిలో రెండు తాచుపాముల్లా తళతళ మెరుస్తున్నాయి

రైలు చప్పుడు చేస్తూ వచ్చి ఆగింది. దాన్లో రెండు పెట్టెలనిండా తుపాకులతో నెత్తిమీద టోపీలతో పోలీసులు. మిగిలిన పెట్టెలు క్రిక్కిరిసి ఉన్నాయి. అయినా ఈ జనం ఒకరినొకరు తోసుకుంటూ కుమ్ముకుంటూ ఎగబడ్డారు ఆడవాళ్ళూ, పిల్లలూ పెద్దలూ అందరూ అరుచుకుంటూ లోపలికి జొరబడేందుకు ప్రయత్నిస్తున్నారు కొందరు లోపల ఉన్న వారిని కొద్దిగా సర్దుకుని తాము ఎక్కేందుకు వీలు కల్పించవలసిందిగా ప్రాధేయపడుతున్నారు 'బాబ్బాబూ! మాకూ పిల్లలకూ రెండురోజుల నుంచీ తిండీ తిప్పలూలేవు కాస్త లోపలికి రానివ్వండి' అని వేడుకుంటున్నారు. కొందరు గదమాయిస్తున్నారు స్త్రీలు చంకలలో పిల్లలతో నలిగిపోతున్నారు. పిల్లలు ఏడుస్తున్నారు. చుట్టుపక్కల అంతా నరకంలా వుంది.

అంతలో గార్డు ఈలవేశాడు దాంతో మరింత తొక్కిడి ప్రారంభమైంది. నేను కమ్మీ పట్టుకుని, కుడిపాదం ముందు భాగం మాత్రమే ఫుట్‌బోర్డుమీద ఆనించి సర్దుకున్నాను. నా మిత్రులిద్దరూ అప్పటికే లోపలికి దూరి చేయి కదలించేందుకైనా వీలు లేని విధంగా జనంలో ఇరుక్కుపోయారు.

రైలు లెక్కలేనంతమంది శరణార్థులతో నిండి ఉబ్బిపోయినట్టున్నది. మరుక్షణంలో నెమ్మదిగా బయలుదేరింది. లోపలికి ఎక్కలేక నిస్సహాయంగా నిలబడి పోయిన జనాన్ని వెనుకనే వదిలేసి చప్పుడు చేసుకుంటూ బయలుదేరింది. ప్లాట్‌ఫారంమీద మిగిలిపోయినవారు దీనంగా చూస్తూ నిలబడిపోయారు. వాళ్ళందరి కళ్ళల్లోనూ నీళ్ళు నిలిచి వున్నాయి నా గుండె గొంతుకలో కొట్టుమిట్టాడింది. ఆర్ద్రమైన కళ్ళను తుడుచుకుని పక్క వ్యక్తి వంక చూసి నవ్వి 'కంట్లో నలుసు పడింది' అన్నాను. అతడు కూడా నవ్వి ఊరుకున్నాడు.

మరో గంటసేపు అలాగే నిలబడ్డాను. రైలు నెమ్మదిగా నడుస్తూనే వుంది. చెట్లూ చేమలనూ, గుట్టూపుట్టలనూ, పంటచేలనూ వెనక్కు నెట్టివేస్తూ నెమ్మదిగా నెలలు నిండిన స్త్రీవలె ముందుకు కదులుతున్నది అదుగో, దూరంగా అదేదో ఊరు ..ఏ యిళ్లో తగలబడుతున్నట్లున్నది. ఎర్రని వెలుతురు ఆకాశంలో...

రైలువేగం యింకా తగ్గుతున్నది... అదుగో దూరంగా దీపం...అదేదో చిన్న స్టేషను, రైలువేగం తగ్గుతున్నదేగాని ఎక్కడా ఆగే సూచనలేవి కనిపించడం లేదు. నేను కళ్ళు చికిలించి చూశాను. ఆ మసక వెన్నెలలో ప్లాట్‌ఫారంమీద ఈ రైలుకోసం పడిగాపులు పడివున్న జనం బిలబిల లాడుతూ లేచి నిలబడుతున్నారు.

— మా రైలువేగం తగ్గుతున్నదేగాని

(4వ పేజీ చూడండి)

# తుఫాను

(38 వ పేజీ తరువాయి)

ఆగటంలేదు. జనం కేకలు పెడుతూనే వున్నారు. నేను ఆందోళనతో చూశాను. ఒక యువతి రైలుతోపాటుగా వేగంగా పరుగెత్తుతున్నది ... ఎక్కడ వీలయితే అక్కడ ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నది. పరుగెత్తుతూనే ఫుట్‌బోర్డులమీద నిలబడి వున్నవారిని ప్రాధేయ పడుతున్నది. నేను చివరి పెట్టెలోనుంచి అంతా చూశాను. నాకు అంతలో వెర్రిబలం వచ్చింది నా వెనుకవారిని బలమంతా ఉపయోగించి లోపలికి నెట్టివేశాను. ఫుట్‌బోర్డుమీద కొంచెం ఖాళీవచ్చింది. ఆమె అందు బాటులోకి రాగానే చేయిచాపి రెట్ట పట్టుకుని ఒక్క లాగు లాగాను. ఆమె కూడా వెనుదిరిగి చూసి అందుకు సంసిద్ధంగా ఉన్నందువల్ల సహక రించింది. ఒక కాలు ఫుట్‌బోర్డుమీద ఆనించి చేతో కమ్మీ పట్టు చిక్కించు కుని ఆయాసంతో వగర్చుతూ విసురుగా నామీద వచ్చిపడింది. నేను ఎడమచేయి ఆమె చుట్టూవేసి గట్టిగా పట్టుకున్నాను జనం కొంచెం లోపలికి సర్దుకున్నారు ఆమె వెక్కివెక్కి ఏడుస్తున్నది.

అంతలో రైలు ఒకచోట వంపు తిరగడంవల్ల మామీద మసక వెన్నెల పడింది. నేను అకస్మాత్తుగా బాగా దగ్గరగా ఉన్న ఆమె మొహంలోకి చూశాను. అంతే! కళ్ళు తిరిగి నట్టయింది. తూలి పడబోయి తమా యించుకుని 'సీతా!' అని అరిచాను.

ఆమె నివ్వెరపోయి తలఎత్తి కన్నీళ్ళు పొరగుండా నావంక చూసింది. మరు క్షణంలో మెరుపు మెరిసినట్టయి అంత లోనే పెద్దగా ఏడుస్తూ నన్ను బల్లిలా కరుచుకుపోయింది. నేను ఎన్నో ప్రశ్నలు వేశాను. ఆమె ఏడుస్తూనే అన్నిటికీ సమాధానాలు చెప్పింది. 'అమ్మ చచ్చి పోయింది. నిన్నరాత్రి...ఇంటిమీదికి జనం వొచ్చి పడ్డారు...రాళ్ళురువ్వి బూతులు తిట్టారు. అమ్మ విరుచుకుని పడి పోయింది...నేను పారిపోయి వచ్చేశాను ఒక బండివాడికి పదిహేను రూపాయలిచ్చి... ఇంకా యిద్దరు ముగ్గురు వొస్తూవుంటే వాళ్ళతో వొచ్చేశాను ... వాళ్ళిక్కడ స్టేషనుదగ్గర దిగిపోయారు...ఇందాకే ఇద్దరు మనుషులు మెడలో గొలుసు యిమ్మ న్నారు...ఇచ్చేశాను...వాళ్ళు నన్ను పట్టు కోబోయారు. పారిపోయివచ్చేసి...జనంలో కలిసిపోయి వాళ్ళ కంటబడకుండా... గడి పాను...' అని మాట్లాడుతూనే పెద్దగా ఏడ్చింది.

జనం మమ్మల్ని లోపలికి రానిచ్చారు. సీతను ఒక పక్క క్రిందనే కూర్చో పెట్టాను ఆమె వెక్కుతూ మధ్య మధ్య నీళ్ళు నిండిన కళ్ళతో నావె పుచూస్తూ అంతలోనే నిద్రపోయింది ఆమె జుట్టు చెదిరిపోయి వుంది ముఖం వస్నె తరిగి వుంది. దుస్తులు మాసిపోయి ఉన్నాయి. నిద్రలోకూడా ఉండి ఉండి ఉలిక్కి పడు తున్నది నుదుట చెమటకు కొన్ని వెంట్రు కలు అంటుకుపోయి ఉన్నాయి నిద్రలో కూడా నా చెయ్యి మాత్రం వదలలేదు నేను అలాగే ఆమెవైపు చూస్తూనే రైలు కుదుపుకు ఊగుతూ, జోగుతూ కూర్చుండిపోయాను. అంతలోనే నాకళ్ళు మూతలు పడ్డాయి.

రైలు ఎక్కడ ఆగిందో, ఎక్కడ ఆగ లేదో, ఎక్కడ జనం రైలును ఆపేం దుకు ప్రయత్నించారో, ఎక్కడ పోలీ సులు గాలిలోకి తుపాకులు పేల్చారో — ంటూ వివరాలేవీ మాకు తెలియవు.

నాకు మెలకువ వచ్చేసరికి తెల్లవారు తున్నది. సీత నా చేతిని గట్టిగా పట్టు కుని యింకా నిద్రపోతూనే వున్నది. అంతలో నా వెనక నవ్వు వినిపించింది. వాసుదేవరావు ఇంకా అలాగే నిలబడి ఉన్నాడు ఆయన పక్కనే ఆ టీచరు .. వాళ్ళిద్దరూ రాత్రి అంతా అలాగే నిల బడే ఉండి ఉంటారు.

వాసుదేవరావు నవ్వి 'లేవండిక...బెజ వాడ ఎంతో దూరం లేదు...అయిదు నిము షాల్లో వచ్చేస్తుంది..' అన్నారు. నేను లేచాను. సీత కళ్ళువిప్పి చూసింది

రైలు యిప్పుడు వేగంగనే పోతున్నది. మరి కొద్దిసేపట్లో సిమెంటు ఫ్యాక్టరి, స్టేషనుయార్డు గడిచి వచ్చాము మరో క్షణంలో రైలు ఆగింది. నేను సీత చేయి పట్టుకుని జనాన్ని బతిమిలడుకుని సందుచేసుకుని దిగాను. సీతకూడా నా వెన కనే దిగి కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తు న్నది. మా వెనుకనే వాసుదేవరావుగారూ, ఆ టీచరుగూడా దిగారు. ప్లాట్‌ఫారంమీద కొందరు వలంటీర్లు తిరుగుతున్నారు. మరికొందరు ఇలా వలస వచ్చేవారిని చూడటంకోసం గుమికూడుతున్నారు ఆ టీచరు చుట్టూ క్షణంలో ఎంతోమంది జనం చేరారు. అతడు పెద్ద గొంతుకతో 'ఇదుగో చూడండి నా మీసం...ఇది నా అనబడే రాష్ట్రంలో నాకు జరిగిన గౌరవం...' అని అరుస్తున్నాడు నేను వాసుదేవరావుగారి వంక చూశాను ఆయన నవ్వి 'మీరు అదృష్టవంతులు. నేనింకా నెల్లూరుదాకా వెళ్ళాలిగా' అన్నాడు.

స్టేషనునిండా జనసమూహం...కట్టు బట్టలతో వలస వచ్చిన జనం లెక్క లేనంతమంది ఎక్కడపడితే అక్కడ సర్దు కున్నారు. అటువంటివారికి అన్నపు పొట్లాలు సమకూర్చుతూ సహాయం చేస్తూ కొందరు స్వచ్ఛంద సేవకులు, అక్కడక్కడ పోలీసులు...అంతా గందర గోళంగా ఉంది.

సీతా నేనూ ఆ జనసముద్రంలో పడి మా ప్రయత్నం ఏమీ లేకుండానే స్టేషను యివతలికివచ్చి తేలాము. తర్వాత యిద్దరం చేంయీ, చేంయీ పట్టుకుని బందరు రైలు కట్టమీద నడుస్తూ ఒక చోట ఆగి ఒకరివంక ఒకరం చూసి నవ్వు కున్నాము.

ఎదురుగా సూర్యబింబం బంగారు బంతిలా ఉదయిస్తున్నది పక్షులు ఆహ్లాద కరంగా హాయిగా విన్యాసాలు చేస్తు న్నాయి.

నేను సీత చేయి పట్టుకుని, దూరంగా చూపిస్తూ 'సీతా! అదుగో మన యిల్లు...' అన్నాను. సీత నవ్వింది.

నేనూ నవ్వుదామని ప్రయత్నించాను, కాని నా మనసులో అనేక ప్రశ్నలు ... జరిగిందేమిటి? ఎందుకిలా జరిగింది? ఎవరీ చిచ్చును రగిల్చినవారు? ఈవైరం ఎందుకు? దీని ఫలితం ఏమిటి? ఈ తుఫాను ఎప్పటికి తగ్గుతుంది?

నాకు నవ్వు రాలేదు ●